క్లుప్తంగా

చిట్టచివరి గడపకూ ప్రభుత్వ పథకాలు అందించాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): వార్డు సచివాలయం సిబ్బంది, వలంటీర్లు సమన్వయంతో పనిచేసి చిట్టచివరి గడపకూ ప్రభుత్వ పథకాలు అందించేందుకు కృషి చేయాలని 31వ డివిజన్ కార్పొరేటర్ పెనుమత్స శిరీష తెలిపారు. స్థానిక 31వ డివిజన్ పసుపుతోట 206 వార్డు సచివాలయంలో బుధవారం సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. పథకాలు రానివారికి ఎందుకు పథకాలు వర్తించలేదో తెలియజేయాలని అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకాలు అందించేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు సెక్రటరీలు, వలంటీర్లు పాల్గొన్నారు.

నెట్‌బాల్ క్రీడాకారులకు సత్కారం



మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాలలో బుధవారం కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల పురుషుల టోర్నమెంట్‌లో ద్వితీయ స్థానం సాధించిన కళాశాల నెట్‌బాల్ క్రీడాకారులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. తమ కళాశాల విద్యార్థులు అంతర్ కళాశాల పోటీల్లో సత్తా చాటి ద్వితీయ స్థానం సాధించటం కళాశాలకే గర్వకారణమన్నారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని పతకాలు సాధించి కళాశాల, నగర పేరు ప్రఖ్యాతులు ఇనుమడింప చేయాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల వ్యాయామ విద్య విభాగాధిపతి డాక్టర్ ఎం.కోటేశ్వరరావు, డాక్టర్ బి.యుగంధర్ పాల్గొని క్రీడాకారులను అభినందించారు.

వైఎస్సార్ బీమాతో ధీమా



మధురానగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ బీమాతో నిరుపేద కుటుంబాలకు ధీమా కల్పించామని నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ కాళ్ల ఆదినారాయణ అన్నారు. స్థానిక 57వ డివిజన్‌లో బుధవారం కార్పొరేటర్ ఇసరపు దేవితో కలిసి వైఎస్సార్ బీమా నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఆదినారాయణ మాట్లాడుతూ.. కుటుంబ పెద్దను కోల్పోయి కష్టాల్లో ఉన్న కుటుంబాలను ఆదుకునేందుకు వైఎస్సార్ భీమా ఉపయోగపడుతుందన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఇసరపు రాజు తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాపై అవగాహన సదస్సు



మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ప్రజ్వల్ స్వచ్ఛంద సంస్థ, కళాశాల స్త్రీ సాధికారత కమిటీ, ఇంక్లూజివ్ కమిటీ సంయుక్త ఆధ్వర్యాన మానవ అక్రమ రవాణాపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి, ప్రజ్వల్ స్వచ్ఛంద సంస్థ సీనియర్ సమన్వయకర్త వై.చంద్రయ్య మాట్లాడారు. తెలుగు రాష్ట్రాలైన ఆంధ్ర, తెలంగాణాలో జరుగుతున్న మానవ, అవయవ అక్రమ రవాణా గురించి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండటంతో పాటు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మానవ అక్రమ రవాణా ఏ విధంగా జరుగుతుందో వివరించారు. కార్యక్రమంలో స్త్రీ సాధికారత సమన్వయకర్త డాక్టర్ బి.శుభ, టి.వి.వి.ప్రియ, తహసీన్, లక్ష్మీభారతి, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

ఆటోనగర్(విజయవాడతూర్పు): కరెన్సీనగర్‌లో వ్యభిచారం నిర్వహిస్తున్న ఇంటిపై పటమట పోలీసులు బుధవారం దాడి చేశారు. స్థానిక కరెన్సీనగర్ గణేష్‌నగర్ కాలనీ 11వ లైన్ అపార్ట్‌మెంట్‌లో గత కొంతకాలంగా గుట్టుగా వ్యభిచారం నిర్వహిస్తున్నారు. పోలీసులకు వచ్చిన పక్కా సమాచారంతో దాడి చేసి ముగ్గురు మహిళలు, మరో ఇద్దరు విటులతో పాటు నిర్వాహకులను అదుపులోకి తీసుకున్నారు. సంబంధిత ఆర్గనైజర్ యువకులకు సెల్ ఫోన్‌లో యువతుల ఫొటోలను పంపుతున్నట్లు పోలీసులు చెప్పారు. వీరందరిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసును మోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రిజిస్ట్రేషన్ సమస్యకు త్వరలో పరిష్కారం

- సీఎం వైఎస్ జగన్ చేతులమీదుగా పట్టాలు అందజేస్తాం
- రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు మల్లాది విష్ణు



సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే విష్ణు, డెప్యూటీ మేయర్ శ్రీశైలజ తదితరులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నియోజకవర్గంలో సుమారు 25 వేల పేద కుటుంబాలు దశాబ్దాల కాలంగా ఎదుర్కొంటున్న రిజిస్ట్రేషన్ సమస్యకు మార్చి నాటికి పరిష్కారం చూపుతామని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 58వ డివిజన్ 241వ వార్డు సచివాలయ పరిధిలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. నగర డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, అధికారులతో కలిసి గడప గడపకు వెళ్లి స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. దారి పొడవునా ఎమ్మెల్యేకి ప్రజల నుంచి అపూర్వ స్వాగతం లభించింది. తమ ఇంటికి విచ్చేసిన ప్రజాప్రతినిధులను ప్రజలు సాదరంగా ఆహ్వానించి ఆప్యాయంగా పలకరించి పుష్ప గుచ్ఛాలు, దుశ్శాలువలతో సత్కరించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమానికి చిరునామాగా, అభివృద్ధికి కేంద్ర బిందువుగా ముందుకు సాగుతోందని మల్లాది విష్ణు అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేతులమీదుగా హక్కుతో కూడిన పట్టాలను అందజేస్తామని చెప్పారు.

రూ.4.16 కోట్ల వ్యయంతో ఎలివేటెడ్ రిజర్వాయర్

ప్రజల అవసరాలను ఎప్పటికప్పుడు గుర్తిస్తూ అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. ఇందులో భాగంగా వై.వి.ఎస్టేట్‌లో రూ. 4.16 కోట్ల నిధులతో 1500 కెఎల్ ఎలివేటెడ్ రిజర్వాయర్ నిర్మాణానికి గురువారం భూమిపూజ నిర్వహిస్తామన్నారు. దీని ద్వారా శివారు కాలనీల్లోని ప్రతిఒక్క ఇంటికీ రెండు పూటలా సరిపడా మంచినీటి ఇచ్చేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు.

సంస్కార హీనంగా నారా లోకేష్ భాష

సభ్య సమాజం తలదించుకునేలా సంస్కారహీనమైన భాషను నారా లోకేష్ మాట్లాడుతున్నారని మల్లాది విష్ణు అన్నారు. కరోనాకు భయపడి హైదరాబాద్‌లో దాక్కున్న చంద్రబాబు, నారా లోకేష్.. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని భయపెడతామని బీరాలు పలకడం హాస్యాస్పదమన్నారు. ప్రజలంతా వైఎస్సార్ సీపీ వెంటే ఉన్నారని.. ఓర్వలేక టీడీపీ నీచ రాజకీయాలకు తెరదీసిందన్నారు.

అనంతరం నగర డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి మాట్లాడుతూ.. తెలుగుదేశం గత ఐదేళ్ల పాలనలో డివిజన్‌కు చేసింది శూన్యమని విమర్శించారు. గుడ్ మార్నింగ్ విజయవాడ సెంట్రల్ కార్యక్రమంలో భాగంగా ఈ ప్రాంతంలో పర్యటించినప్పుడు ప్రజల విజ్ఞాపనల మేరకు ఎమ్మెల్యే మల్లాది విష్ణు నూతన రహదారులను నిర్మింపజేసినట్లు తెలిపారు. కానీ తమ హయాంలో ప్రజలకు చేసిందేమీ లేక.. మంచి చేస్తున్న జగనన్న ప్రభుత్వంపై మాజీ ఎమ్మెల్యే బోండా ఉమా బురదచల్లే కార్యక్రమాలు చేస్తున్నారని మండిపడ్డారు. ధైర్యముంటే ఈ ప్రాంత ప్రజలకు ఏం చేశారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీఈలు గురునాథం, రామకృష్ణ, ఏఎంఓహెచ్ రామకోటేశ్వరరావు, సీడీఓ జగదీశ్వరి, నాయకులు అవుతు శ్రీనివాసరెడ్డి, అఫ్రోజ్, శర్మ, రాజు, భోగాది మురళి, తోపుల వరలక్ష్మి, ఇసరపు రాజారమేష్, సతీష్ రెడ్డి, నేరెళ్ల శివ, కె.శ్రీనివాసరావు, మురళి అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా దత్తసాయి మందిర వార్షికోత్సవం



మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో బుధవారం 8వ వార్షికోత్సవాలు రెండో రోజుకు చేరుకున్నాయి. బాబావారికి విశేషంగా పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో బాబావారి చిత్రపటంను ఉంచి మధురానగర్ వీధుల్లో బిక్షాటన చేశారు. దారి పొడవునా సాయికీర్తనలు ఆలపిస్తూ కోలాట నృత్యాలతో బిక్షను స్వీకరించారు. భక్తులు, మహిళలు హారతులిస్తూ బాబాకు స్వాగతం పలికారు. మందిరంలో శ్రీసాయినక్షత్రమాలిక మండలి ఆధ్వర్యాన బాబా పారాయణం జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని బాబాను దర్శించుకుని భక్తి శ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమాలను మందిర వ్యవస్థాపకుడు తంగెళ్లమూడి వీర మోహనరావు పర్యవేక్షించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు విద్యుత్ సబ్‌స్టేషన్ 11 కేవీ లక్ష్మీనగర్ ఫీడర్ పరిధిలో విద్యుత్ వైర్ల మరమ్మతుల దృష్ట్యా గురువారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బి.వి.సుధాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. లక్ష్మీనగర్, మానేపల్లి వారి వీధి, జాగర్లమూడి వారి వీధి, కటకం చెంచయ్య కల్యాణ మండపం ఏరియా, ఆర్‌వీఎస్ఎల్ ఆఫీస్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. వినియోగదారులు గమనించి, విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ నిరసన ర్యాలీ



ర్యాలీ చేస్తున్న బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్

మధురానగర్(విజయవాడసెంట్రల్): 7వ సెంట్రల్ పే కమిషన్ ఉత్తర్వుల ప్రకారం 2017 జనవరి నుంచి బీఎస్ఎన్ఎల్ పెన్షనర్లకు పే రివిజన్ చేయాలని బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వి.వరప్రసాద్ డిమాండ్ చేశారు. ఆలిండియా బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, బీఎస్ఎన్ఎల్ రిటైర్డ్ ఎగ్జిక్యూటివ్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యాన బందరు రోడ్డులోని బీఎస్ఎన్ఎల్ ఎక్స్ఛేంజి నుంచి డీవీ మేనర్ వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఎస్ఎన్ఎల్‌లో పదవీ విరమణ చేసిన పెన్షనర్స్‌కు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా 10 ఏళ్లకు ఒకసారి రివిజన్ జరగాలన్నారు. 2017 జనవరి నుంచి పే రివిజన్ చేయాల్సి ఉండగా ఐదేళ్లు దాటినప్పటికీ కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవటం లేదన్నారు. ఏపీ సర్కిల్ అధ్యక్షుడు కెఎస్ కోటేశ్వరరావు, సర్కిల్ ముఖ్య సలహాదారులు ఎంఆర్ఎస్ ప్రకాశరావు, సర్కిల్ కార్యదర్శి డి.వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి సి.భాస్కరరావు, రిటైర్డ్ ఎగ్జిక్యూటివ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.కేశవరావు, కోటేశ్వరరావు, శివరామకుమార్ మాట్లాడారు. అనంతరం ప్లకార్డులు చేతబూని నినాదాలు చేస్తూ నిరసన ర్యాలీ నిర్వహించారు. సీసీకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్ రిటైర్డ్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి నగరంలో 144 సెక్షన్ అమలు

విజయవాడ స్పోర్ట్స్: శాంతిభద్రతల పరిరక్షణకు విజయవాడ నగరంలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 10 నుంచి మార్చి 31వ తేదీ వరకు(50 రోజులు) 144 సెక్షన్ నిషేధాజ్ఞలు అమలు చేస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం, భవానిపురం, వన్‌టౌన్, సత్యనారాయణపురం, అజిత్‌సింగ్‌నగర్, నున్న, గవర్నర్‌పేట, సూర్యారావుపేట, కృష్ణలంక, మాచవరం, గుణదల, పటమట పోలీస్ స్టేషన్ల పరిధిలోని ప్రాంతాల్లో ఈ ఆంక్షలు అమలులో ఉంటాయన్నారు. ఆంక్షలు అమలులో ఉన్న సమయంలో నలుగురు, అంతకు మించిన వ్యక్తులు ఒకే ప్రదేశంలో గుమిగూడినా, కర్రలు, రాళ్లు, ఇతర మారణాయుధాలతో సంచరించినా శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రౌడీషీటర్ క్రైం బాబీ నగర బహిష్కరణ పొడిగింపు

విజయవాడ స్పోర్ట్స్: రౌడీషీటర్ సందక దుర్గారావు అలియాస్ బల్లిగుడ్డు అలియాస్ క్రైం బాబీ నగర బహిష్కరణను మరో ఆరు నెలలు పొడిగిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా తెలిపారు. విజయవాడ మాచవరానికి చెందిన క్రైం బాబీ కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో పలు మార్లు ప్రజాశాంతిభద్రతలకు విఘాతం కలిగించారు. అనేక సార్లు జైలు జీవితం అనుభవించినా అతనిలో ఎలాంటి మార్పు రాకపోవడంతో గతేడాది జూలైలో నగరం నుంచి బహిష్కరించారు. అయినా అతనిలో మార్పు రాలేదని, నగరంలోకి వస్తే మరిన్ని ఘర్షణలకు పాల్పడి, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తాడనే నిఘా వర్గాల సమాచారంతో బహిష్కరణను పొడిగించామని సీపీ చెప్పారు.

ముగిసిన నవదిన ప్రార్థనలు

గుణదల(విజయవాడతూర్పు): మేరీమాత పుణ్యక్షేత్రంలో గత తొమ్మిది రోజులుగా జరుగుతున్న నవదిన ప్రార్థనలు బుధవారంతో ముగిశాయి. ఈ ముగింపు వేడుకలకు పెద్ద సంఖ్యలో క్రైస్తవులు హాజరయ్యారు. పలు విచారణల భక్తులు, మఠకన్యలు, పుణ్యక్షేత్ర గురువులు జపమాలలు ధరించి కొండపై కి చేరుకున్నారు. మరియమాత స్వరూపం వద్ద జరిగిన సమష్టి బలి పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులనుద్దేశించి మోన్సిగ్నోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్ దేవుని వాక్య సందేశం అందించారు. ఆయన మాట్లాడుతూ.. మరియమాత చల్లని దీవెనలు భక్తులందరిపై ఉంటాయన్నారు. మరియ తల్లిని ఆశ్రయించిన భక్తుల జీవితాలు ఆనందంగా ఉంటాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఆ నిష్కళంక మాతకు విధేయులుగా ఉండాలని కోరారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో సమష్టి దివ్య బలిపూజ సమర్పించి భక్తులకు సత్ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఫాదర్ గాబ్రియేలు, ఫాదర్ అనిల్, ఫాదర్ థామస్ పాల్గొన్నారు.

• ఉత్సాహంగా మహిళా ఫెస్ట్



మాట్లాడుతున్న డీసీపీ విశాల్ గున్నీ





విజయవాడ సిద్ధార్థ ఆడిటోరియంలో బుధవారం తరుణీతరంగాలు ఆధ్వర్యంలో ఐదవ మహిళా ఫెస్ట్ ఉత్సాహంగా ప్రారంభమైంది. పలువురు వక్తలు పాల్గొని తమ సందేశం ఇచ్చారు. రెండు రోజుల పాటు జరిగే మహిళా ఫెస్ట్‌లో శాస్త్రీయ, జానపద నృత్య పోటీలు, అభ్యుదయ, జానపద గీతాలాపన పోటీలు, కథ, పద్య, కవితా రచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ.

కళా సంస్థలు ప్రజాసేవలో భాగస్వాములు కావాలి

ఏపీ అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.విజయబాబు



నివాళులర్పిస్తున్న అధికార భాషా సంఘం అధ్యక్షుడు విజయబాబు, గోళ్ల నారాయణరావు, వెన్నా వల్లభరావు

విజయవాడకల్చరల్: సాంస్కృతిక కళా సంస్థలు ప్రజాసేవలో భాగస్వాములు కావాలని అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.విజయబాబు తెలిపారు. తెలుగు కళావాహిని పోలవరపు కోటేశ్వరరావు సాహితీపీఠం, శ్రీ కళాభారతి ఆధ్వర్యంలో గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదిక మీద బుధవారం జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకురాలు, సామాజిక కార్యకర్త కోట ఝాన్సీ రాణి సంస్మరణ సభను నిర్వహించారు. విజయబాబు మాట్లాడుతూ ఆమె శాస్త్రీయ కళారంగాల అభివృద్ధికి కృషి చేశారన్నారు. జనవిజ్ఞాన వేదిక కార్యక్రమాల ద్వారా యువతీ యువకులను చైతన్య పర్చారని తెలిపారు. పోలవరపు కోటేశ్వరరావు సాహితీ పీఠం వ్యవస్థాపకుడు గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ.. ఘంటసాల చైతన్యవేదిక ద్వారా ఆమె కొత్త గాయనీ గాయకులను పరిచయం చేశారన్నారు. సంస్మరణ కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు చింతకాయల చిట్టిబాబు, కోట వెంకటేశ్వర రెడ్డి, విశ్రాంత అధ్యాపకులు డాక్టర్ వెన్నా వల్లభరావు, డాక్టర్ గుమ్మా సాంబశివరావు పాల్గొని ఝాన్సీరాణి సేవలను కొనియాడారు.

వ్యాయామంతో ఆరోగ్యకర సమాజం

రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు మల్లాది విష్ణు



దుర్గాపురంలో ఓపెన్ జిమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు, కార్పొరేటర్ మల్లీశ్వరి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండేందుకు నిత్యజీవితంలో వ్యాయామాన్ని ఒక భాగంగా చేసుకోవాలని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు సూచించారు. 27వ డివిజన్ దుర్గాపురం వాకర్స్ క్లబ్‌లో రూ.12.70 లక్షల నిధులతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను స్థానిక కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరితో కలిసి బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జిమ్‌లో ఏర్పాటు చేసిన పరికరాలను పరిశీలించిన ఆయన.. కొద్ది సేపు వ్యాయామం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ.. శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యానికి వ్యాయామం ఎంతో అవసరమన్నారు. కరోనా తర్వాత ప్రజలందరూ వ్యాయామంపై దృష్టి పెడుతున్నారని.. అటువంటి వారి కోసం ఓపెన్ జిమ్ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. నగర ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పార్కుల సుందరీకరణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పారు. గత అప్రభుత్వం పార్కుల అభివృద్ధిని పూర్తిగా విస్మరించిందని.. తాను మరలా ఎమ్మెల్యేగా గెలిచాక నియోజకవర్గంలో 80 శాతం వరకు పార్కుల పనులు పూర్తి చేశామని తెలిపారు. రూ.కోటి నిధులతో రాఘవయ్య పార్కు, రూ. 35 లక్షలతో లెనిన్ సెంటర్ పార్కు, రూ.11 లక్షలతో జి.వి.శాస్త్రి పార్కు, రూ.28.50 లక్షలతో రాఘవచారి పార్కు, రూ.18 లక్షలతో ముత్తవరపు నగరాజకుమారి పార్కు, రూ.8 లక్షలతో ప్రకాష్ నగర్ పార్కు, రూ. 7.50 లక్షలతో ఏపీఎస్ రెడ్డి రోడ్డులోని వీర్ల బాలరాజు పార్కు, రూ.14 లక్షలతో తెలుగుతల్లి పార్కు, కంద్రిక రామాలయం వీధిలో రూ.72 లక్షల నిధులతో రెండు పార్కులను అభివృద్ధి చేశామన్నారు. అలాగే వాంబే కాలనీ ఐకానిక్ పార్కులో 14వ ఆర్థిక సంఘం నిధులతో పనులు జరుగుతుండగా.. నెల రోజుల్లో అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. అనంతరం వాకర్స్ క్లబ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, వాకర్స్ క్లబ్ సభ్యులు, వాకర్స్ పాల్గొన్నారు.

శ్రీరామమూర్తి హరికథా సేవలు ఆదర్శనీయం



మాట్లాడుతున్న బుర్రా పద్మనాభ శాస్త్రి, వేదికపై దావులూరి వీరభద్రరావు, దుర్గామహాలక్ష్మి

విజయవాడకల్చరల్: విఖ్యాత హరికథా భాగవతులు గుడిపాటి శ్రీ రామమూర్తి హరికథా సేవలు ఆదర్శనీయమని బుర్రా పద్మనాభ శర్మ అన్నారు. గుడిపాటి కల్చరల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో సీతారామా కల్యాణమండపంలో బుధవారం హరికథా భాగవతార్ గుడిపాటి శ్రీ రామమూర్తి 166వ జయంతి ఉత్సవం, హరికథా గానం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పద్మనాభశాస్త్రి మాట్లాడుతూ హరికథ పితామహుడు ఆదిభట్ల నారాయణ దాసు స్ఫూర్తితో సంగీత సాహిత్యాలను మేళవిస్తూ భాగవత తత్వాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేవారన్నారు. ఆయనతో అనుబంధం గుర్తుచేసుకున్నారు. సంగీత విద్వాంసుడు దావులూరి వీరభద్రరావు మాట్లాడుతూ.. ఆయన కథా సంవిధానం శ్రవణానందంగా ఉండేదన్నారు. నాటి రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ ముందు హరికథా గానం చేశారని గుర్తుచేశారు. జయంతి సభలో గుడిపాటి దత్తు, గుడిపాటి కల్చరల్ ఆర్ట్స్ వ్యవస్థాపకుడు జయరాం సుధాకర్ పాల్గొన్నారు. కథా శ్రవణంలో భాగంగా హరికథా భాగవతారిణి మోపిదేవి దుర్గామహాలక్ష్మి సుందరా కాండ ఆధారంగా రచించిన హనుమత్ సందేశం కథను గానం చేశారు. పాణ్యం దక్షిణా మూర్తి, అమ్ముల ప్రసాద్ వాద్య సహకారం అందించారు.

తెలుగు నాటక రంగ చరిత్ర విశిష్టమైనది



రామారావును సత్కరించిన మధుమోహన కృష్ణ, బోడి ఆంజనేయరాజు, కృష్ణ ప్రసాద్ తదితరులు

విజయవాడకల్చరల్: తెలుగు నాటక రంగ చరిత్ర విశిష్టమైనదని హ్యాపీ రిసార్ట్స్ అధినేత అంబటి మధుమోహనకృష్ణ అన్నారు. శిల్ప ఫౌండేషన్ ఆధ్వర్యంలో గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో బుధవారం నాటక రంగ ప్రముఖులకు ఆత్మీయ సత్కారం, నాటక ప్రదర్శన నిర్వహించారు. మధుమోహన కృష్ణ తెలుగు నాటకరంగంలో వస్తున్న మార్పులను స్వాగతించాలని సూచించారు. నాటక రంగ ప్రముఖుడు ఎస్ఎం బాషా మాట్లాడుతూ కొత్త తరాన్ని నాటకం రంగంవైపు తీసుకురావాల్సిన అవసరముందన్నారు. నిర్వాహకులు సాహితీ ప్రముఖుడు జరుగుల రామారావుకు శిల్పా ఫౌండేషన్ పురస్కారాన్ని ప్రదానం చేశారు. సామాజిక సేవా రంగానికి పురాణం కృష్ణ ప్రసాద్‌ను ఆత్మీయంగా సత్కరించారు. చివరిగా బీనా దేవి రచించి, అద్దేపల్లి లక్షణ శాస్త్రి దర్శకత్వం వహించిన థ్యాంక్స్ ఫర్ ది పీఎం సాంఘిక నాటికను ప్రదర్శించారు. కార్యక్రమంలో బోడి ఆంజనేయరాజు, కృష్ణ ప్రసాద్, శిల్పా ఫౌండేషన్ ట్రస్టీ భాస్కరరావు పాల్గొన్నారు.

యువత మత్తుకు బానిసలు కావద్దు

లబ్బీపేట(విజయవాడతూర్పు): యువత మత్తు పదార్థాలకు బానిసలుగా మారి, బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఇన్‌స్పెక్టర్ ఎ.స్వామినాథన్ సూచించారు. నగరంలోని కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాల యాంటీ ర్యాగింగ్ సెల్ ఆధ్వర్యంలో బుధవారం ర్యాగింగ్ నివారణ, మందులు దుర్వినియోగం అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సదస్సులో స్వామినాథన్ మాట్లాడుతూ.. ర్యాగింగ్ అనే విష సంస్కృతిని కళాశాలల దరిచేరనీయొద్దన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడితే జైలు శిక్షణతో పాటు, భవిష్యత్తు దెబ్బతినే అవకాశం ఉందన్నారు. కళాశాలలో విద్యార్థులందరూ స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. మత్తు పదార్థాల దరిచేరవద్దని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎ.సునీత, యాంటీ ర్యాగింగ్ సెట్ కో ఆర్డినేటర్ జి.రమణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత రాష్ట్రానికి కృషి

కృష్ణలంక(విజయవాడతూర్పు): డ్రగ్స్ రహిత రాష్ట్రానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కృష్ణలంక పీఎస్ సీఐ ఎం.వి.దుర్గారావు అన్నారు. కృష్ణలంకలోని ఐడియల్ పబ్లిక్ స్కూల్, బాలాజీనగర్‌లోని మహితా పబ్లిక్ స్కూల్‌లో మాదక ద్రవ్యాలు సేవించడం వలన కలిగే అనర్థాలపై బుధవారం అవగాహన కల్పించి కరపత్రాలు పంపిణీ చేశారు.